క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్సీ విరాళం



విరాళమిస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం: శాంతిపురం మండలం దండికుప్పంలో నిర్మిస్తున్న శివాలయానికి చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ లక్ష రూపాయల విరాళాన్ని మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆలయ నిర్మాణకర్తలకు అందజేశారు. ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి తనవంతు సాయం చేసినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో శాంతిపురం వైఎస్సార్ సీపీ నాయకులు పెద్దన్న, జనార్ధన్ పాల్గొన్నారు.

ప్రజల వద్దకే వైద్య సేవలు



వెంకట దాసరపల్లెలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జానకీరావు

పులిచెర్ల(కల్లూరు): ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా గ్రామాల్లోని ప్రజల వద్దకే వైద్యసేవలు అందిస్తున్నట్టు కల్లూరు పీహెచ్‌సీ మెడికలాఫీసర్ డాక్టర్ జానకీరావు అన్నారు. మండలంలోని వెంకట దాసరపల్లెలో మంగళవారం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. అక్కడ నడవ లేనివారిని వారి ఇళ్ల వద్దే పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శారద, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

టపాసుల విక్రయానికి లైసెన్సులు తప్పనిసరి

పలమనేరు: టపాకాయలను విక్రయించే వ్యాపారులు విధిగా లైసెన్సులు పొంది ఉండాలని, లైసెన్సు లేకుండా విక్రయిస్తే చర్యలు తప్పవని పలమనేరు ఆర్డీఓ మనోజ్‌కుమార్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. లైసెన్సు రెన్యూవల్ చేసుకోని వారు వెంటనే చేయించుకోవాలన్నారు. ఈ విషయంలో సంబంధిత తహసీల్దార్లు సమగ్ర విచారణ చేసి రెన్యూవల్స్‌కు సిఫారసు చేయాలన్నారు. టపాకాయల విక్రయించే ప్రాంతాల్లో అన్ని జాగ్రత్తలను పాటించాలన్నారు.

9న వాహనాల వేలం

పుంగనూరు: అక్రమ మద్యం కేసుల్లో సీజ్ చేసిన 7 వాహనాలను ఈనెల 9న ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు సీఐ రాఘవరెడ్డి తెలిపారు. ఆసక్తి గలవారు రూ.5వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మద్యం అక్రమ రవాణా కేసుల్లో సీజ్ చేసిన మూడు మోటార్ సైకిళ్లను గురువారం ఉదయం 11 గంటలకు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద వేలం వేయనున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

ఆశావర్కర్ల సేవలు భేష్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టరు గిరీష

సదుం: ఆశా కార్యకర్తల సేవలకు వెలకట్టలేమని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టరు గిరీష అన్నారు. మంగళవారం చెరుకువారిపల్లె పీహెచ్‌సీలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆశాడే నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడారు. కరోనా మహమ్మారి విజృంభినప్పుడు ఆశావర్కర్లు ప్రాణాలకు తెగించిన సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చరణ్, లయన్స్‌క్లబ్ సభ్యులు రాజారెడ్డి, మనోహర్‌రెడ్డి, చాముండేశ్వరి, సుబ్రమణ్యం, నాగరాజు, హెల్త్ సూపర్‌వైజర్లు ఉదయభాస్కర్, నీలకంఠ, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కరువు మండలాల సంఖ్య పెంచాలి

పలమనేరు: రాష్ట్రంలోని 440 మండలాల్లో కరువు పరిస్థితులుంటే ప్రభుత్వం కేవలం 103 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం సరికాదని, అన్ని మండలాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించాలని స్థానిక సీపీఐ నాయకులు నాగరాజు, సుబ్రమణ్యం విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానికంగా ఆ పార్టీ కార్యాలయ ఆవరణలో విలేకరులతో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితుల మూలాన పంటలు పండని పరిస్థితి నెలకొందన్నారు. ముఖ్యంలో రాయలసీమలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉందన్నారు. పలమనేరు డివిజన్‌లో కేవలం రెండు మండలాలను మాత్రమే కరువు మండలాలుగా పేర్కొన్నారని చెప్పారు. కరువు రైతుల సమస్యలపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర నాయకులు హరినాథరెడ్డి తదితరులు ఈనెల 11న పలమనేరులో పర్యటించనున్నట్టు తెలిపారు. సమావేశంలో బుర్రా మంజునాథ్, రామమూర్తి పాల్గొన్నారు.

సీఎం జగన్ అవసరం ఎంతో ఉంది

- 'ఏపీ నీడ్స్ జగన్'ను విజయవంతం చేయండి
- ప్రజల హృదయాల్లో వైఎస్సార్ సీపీకి సుస్థిర స్థానం
- ఇంటింటికీ వెళ్లి విస్తృత ప్రచారం
- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



హాజరైన సర్పంచులు, ఎంపీటీసీలు, బూత్ కమిటీ మెంబర్లు, పార్టీ నాయకులు

పుంగనూరు: రాష్ట్రానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ఎంతో ఉందని, సంక్షేమ సారథిగా అన్ని వర్గాలకు ఆయన మేలు చేశారనే విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. అందుకే 'ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని, ప్రతి ఒక్కరూ భాగస్వాములై దీనిని జయప్రదం చేయాలన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీటీసీలు, సర్పంచులు, కన్వీనర్లు, బూత్ కమిటీ మెంబర్లకు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్మన్ మాట్లాడారు. మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వారి మనోగతం ఎలా ఉందో తెలుసుకోవాలన్నారు. దేశంలో ఏ సీఎం కూడా చేయని విధంగా రాష్ట్రంలో వినూత్న పథకాలను అమలు చేసి ప్రజల హృదయాల్లో వైఎస్సార్ సీపీ సుస్థిర స్థానం సంపాదించుకుందని, ఈ ప్రభావం ఎన్నికల్లో పార్టీ విజయానికి బాటలు వేసేలా ఇప్పటి నుంచే ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రజలను చైతన్య పరచి ఓట్లను అభ్యర్థించాలని సూచించారు. ఈనెల 9 నుంచి నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ, ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంతో ప్రతి ఇంటికి వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అనంతరం 'మా నమ్మకం నువ్వే జగన్' కరపత్రాలను చైర్మన్ పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కొత్తపల్లె చెంగారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు జయరామిరెడ్డి, నియోజకవర్గ ఎలక్ట్రోరల్ ఇన్‌చార్జ్ రవితేజారెడ్డి, పార్టీ నాయకులు దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, రమణ, సుబ్రమణ్యం, ప్రభాకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: ఈ నెల 9 నుంచి మండలంలో నిర్వహించనున్న 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్ పిలుపునిచ్చారు. మంగళవారం రొంపిచెర్ల సచివాలయంలో కన్వీనర్లు, బూత్ కమిటీ మెంబర్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 9న రొంపిచెర్ల-1, 10న రొంపిచెర్ల-2, 14న బండకింద పల్లె, 15న బొమ్మయ్యగారిపల్లె, 16న చిచ్చిలివారిపల్లె, 17న గానుగచింత, 20న మోటుమల్లెల గ్రామ సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాత్రి పూట అదే గ్రామ సచివాలయంలో అందరూ నిద్ర చేయాలన్నారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రాష్ట్రానికి సీఎం ఎంత అవసరమో ప్రజలకు చాటి చెప్పి, రాబోవు ఎన్నికల్లోనూ విజయమే లక్ష్యంగా ఇప్పటి నుంచే కృషి చేయాలన్నారు.



మాట్లాడుతున్న ఇబ్రహీంఖాన్

పులిచెర్ల మండలంలో..

పులిచెర్ల(కల్లూరు): ఈనెల 9నుంచి మండలంలోని 10 సచివాలయాల పరిధిలో 'ఏపీకి జగనే ఎందుకు కావాలి?' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ నాదమునిరెడ్డి, సచివాలయ కన్వీనర్ ముర్వత్ బాషా తెలిపారు. 9న పులిచెర్ల, 10న రాయవారిపల్లె, 14,15న కల్లూరు,16న ఎల్లంకివారిపల్లె, 17న దేవళంపేట, 20న ఎర్రపాపిరెడ్డిగారిపల్లె, 21న దిగువపోకలవారిపల్లె, 22న గడ్డంవారిపల్లె, 23న మతుకువారిపల్లె సచివాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వివరించారు. ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

బాలికలకు అన్నింటా అవగాహన ముఖ్యం



మాట్లాడుతున్న న్యాయమూర్తి సింధు

పుంగనూరు: బాలికలు అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సింధు అన్నారు. బాలికల చట్టాలపై మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ బాలికల సంరక్షణ కోసం ఉద్దేశించిన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. అలాగే ఆసుపత్రులలో లింగనిర్ధారణ పరీక్షలు చేయరాదన్నారు. బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. లైంగిక దాడులకు పాల్పడితే పోక్సో చట్టం వేసే కఠిన శిక్షల గురించి తెలియజేశారు. ఇలాంటి విషయాలపై బాలికలకు తల్లిదండ్రులు కూడా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కల్పన, సుగుణ, కళ్యాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో రాహుకాల పూజలు



మయూర వాహనంపై వళ్లీదేవసేనుడు

రామకుప్పం: స్థానిక శ్రీవళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో మంగళవారం భక్తిప్రపత్తులతో రాహుకాల పూజలు చేశారు. ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. బెంగళూరుకు చెందిన వినయ్‌కుమార్ స్వామి అమ్మవార్లకు ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదాలు వితరణ చేశారు.

కరువు మండలంగా పలమనేరు



కల్లాడు వద్ద వేరుశెనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ సంధ్య

పలమనేరు: పలమనేరు మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించిందని మండల వ్యవసాయ అధికారిణి సంధ్య తెలిపారు. మండలంలోని కల్లాడు రైతుభరోసా కేంద్రం పరిధిలో మంగళవారం ఆమె వేరుశనగ ఒబ్బిళ్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, 2023 సంవత్సర వర్షపాత వివరాలు, బెట్ట పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో పరిశీలన మేరకు కరువు మండలంగా ప్రకటించిందని తెలిపారు. మండలంలో ఖరీఫ్‌లో 550 ఎకరాల వేరుశనగ పంట సాగు చేసినట్టు ఈ-క్రాప్‌లో నిర్ధారణ అయిందన్నారు. ఇందులో పంట దిగుబడి 50 శాతం కంటే తక్కువగా ఉన్నట్టు పరిశీలనలో తేలిందన్నారు. దీంతో కరువు మండలాలకు ప్రభుత్వం నుంచి మినహాయింపులు, ప్రయోజనాలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించరూ!

-కమిషనర్‌కు నాయీ బ్రాహ్మణుల వినతి



కమిషనర్ నరసింహప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయీ బ్రాహ్మణులు

పుంగనూరు: తాము క్షౌరవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, తమ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, చైర్మన్ అలీమ్ బాషాకు నాయీ బ్రాహ్మణులు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ సుమారు 2 వేల మంది క్షౌ రవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నామని, అయితే ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, బిహార్ నుంచి వచ్చిన యువకులు క్షౌరశాలలు పెట్టి, తమ కడుపు కొడుతున్నారని వాపోయారు. వారి మూలాన తమ కుటుంబాలు వీధిన పడుతున్నాయని, తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు హేమంత్‌కుమార్, వెంకటేష్, లోకేష్ కుమార్, రాజశేఖర్, రమణ, తులసీరాం, సతీష్, భద్రి రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలు అందుకున్న విద్యార్థులతో కౌన్సిలర్ కిజర్‌ఖాన్, హెచ్ఎం తదితరులు

పుంగనూరు: పట్టణంలోని ఉర్దూ హైస్కూల్‌లో విద్యార్థులకు కంటి వెలుగు పథకం కింద కళ్లద్దాలను హెచ్‌ఎం చలపతి ఆధ్వర్యంలో కౌన్సిలర్ కిజర్‌ఖాన్ మంగళవారం పంపిణీ చేశారు. దృష్టి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి కళ్లద్దాలు ఇవ్వడం, ఆరోగ్యశ్రీ కింద వైద్యసేవలు, అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుకతో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతోందని కౌన్సిలర్ అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి జగనన్నకు అందరూ అండగా ఉండాలని కోరారు.

అంత్యక్రియలకు రూ.10వేలు పంపిణీ



అంత్యక్రియలకు సాయం చేస్తున్న సౌజన్య, వెల్ఫేర్ అసిస్టెంట్ తదితరులు

పలమనేరు: పట్టణంలోని పాతపేటకు చెందిన గుల్బర్ ఆకస్మిక మరణంతో ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా ద్వారా అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలను వార్డు కౌన్సిలర్ హైదర్, సచివాలయ సిబ్బందితో కలసి మంగళవారం అందజేశారు. త్వరలో వీరికి వైఎస్సార్ బీమా పథకం కింద మొత్తం రూ.లక్షసాయం అందుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ సౌజన్య, వెల్ఫేర్ అసిస్టెంట్ మురగేష్ పాల్గొన్నారు.

పాత పీఆర్సీ బకాయిలు చెల్లించండి



మాట్లాడుతున్న పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి

పలమనేరు: కొత్త పీఆర్సీలోపే పాత పీఆర్సీ బకాయిలు చెల్లించాలని స్థానిక ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన 115 జీఓ గురించి ఆయన వివరించారు. తొలుత సభ్యుడు రామచంద్రయ్య మృతికి సంతాపం వ్యక్తం చేశారు. సమావేశంలో రత్నారెడ్డి, వెంకటక్రిష్ణయ్య పాల్గొన్నారు.

దుకాణాలకు జరిమానా

పలమనేరు: పట్టణంలోని పలు దుకాణాలను స్థానిక వార్డు సచివాలయాల శానిటరీ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది మంగళవారం తనిఖీలు చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడుతున్న దుకాణాలకు రూ.4వేల చొప్పున జరిమానా విధించారు.

క్రీడలూ అవసరమే..



చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలూ అవసరమని విజయం విద్యాసంస్థల చైర్మన్ తేజోమూర్తి అన్నారు. మంగళవారం విజయం సీబీఎస్‌సీ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, అండర్-17 విభాగాల్లో క్యారమ్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పలు మండలాల నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. తేజోమూర్తి మాట్లాడుతూ, క్రీడలు శారీరక, మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చాటిన బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డైరెక్టర్ శైలజ, క్రీడా సెక్రటరీ సురేష్, పీడీ పాండ్యన్ పాల్గొన్నారు.

నేడు ఆయుర్వేద వైద్య శిబిరం

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ఆవరణలో బుధవారం తిరుపతి శ్రీవెంకటేశ్వర ఆయుర్వేద కళాశాల ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయుర్వేద వైద్యశిబిరంతోపాటు ఔషధ మొక్కల సాగుపై రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

ఈగల మోత.. జ్వరాల బాధ

- ఆర్డీఓకు క్యాటిల్‌ఫామ్ గ్రామస్తుల ఫిర్యాదు



క్యాటిల్‌ఫామ్‌లోని ఇళ్ల వద్ద టేప్‌కు అతుక్కున్న ఈగలు

పలమనేరు: తమ గ్రామంలోని కోళ్లఫారం వల్ల ఇళ్లల్లో ఈగల మోత పెరిగి జ్వరాలు, విరేచనాల బారిన పడుతున్నామని మండలంలోని మొరం క్యాటిల్‌ఫామ్‌కు చెందిన పలువురు గ్రామస్తులు మంగళవారం ఆర్డీఓ మనోజ్‌కుమార్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. గ్రామానికి ఆనుకుని ఉన్న ఈ కోళ్లఫారం వ్యర్థాల కారణంలో ఈగలు ఎక్కువై ఇళ్లలోకి వచ్చేస్తున్నాయని, భోజనం చేసే సమయంలో ఆహారంలో ఈగలు పడుతున్నాయని, ఎటు చూసినా ఈగలతో నిండిపోతోందని సమస్యను నివేదించారు. ముంబైకి చెందిన ప్రీమియం కంపెనీ నిర్వాహకులు ఈ కోళ్లఫారం నిర్వహిస్తున్నారని, కోళ్లఫారం వద్ద పారిశుధ్యం సమస్యల మూలాన ఈగల మోత పెరిగిందని చెప్పారు. గ్రామంలో విచారణ చేసి కోళ్లఫారం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్డీఓకు ఫిర్యాదు చేసిన వారిలో రాజా, చిట్టిబాబు, గోవిందు, స్టెల్లా, ప్రశాంత్‌తోపాటు పలువురు గ్రామస్తులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి

గంగవరం: మండలంలోని పత్తికొండ పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. బెంగళూరు వైదేహి హాస్పిటల్ సహకారంతో పీహెచ్‌సీ వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ పరిధిలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. క్యాన్సర్, గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులు, మిగిలిన దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న మొత్తం 200మందికి పైగా వైదేహి ఆసుపత్రి వైద్య బృందం ఈసిజి, ఎకో, బీపీ, ఆర్‌బీఎస్ పరీక్షలు ఉచితంగా చేశారు. మందులు పంపిణీ చేశారు. మరికొందరికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా శస్త్రచికిత్సలకు రెఫర్ చేసినట్టు వైద్యాధికారి తెలిపారు. శిబిరంలో వైదేహి హాస్పిటల్ వైద్య బృందం, పత్తికొండ వైద్యాధికారి సర్తాజ్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉత్తమ కండక్టర్లకు అభినందన



ఉత్తమ కండక్టర్లకు అభినందిస్తున్న డీఎం స్వామి



ప్రయాణికులకు బహుమతులు అందజేస్తున్న డీఎం సుధాకరయ్య, జయరామిరెడ్డి

పలమనేరు: పలమనేరు డిపోకు సంబంధించి అక్టోబర్ నెలలో ఉత్తమ ఈపీకే(ఎర్నింగ్ ఫర్ కిలో మీటర్) సాధించిన కండక్టర్లు డీపీ నాయుడు, రమణను డిపో మేనేజర్ టీకే స్వామి మంగళవారం అభినందించారు. వారికి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో పలువురు కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

10న 'డయల్ యువర్ డీఎం'

ఈ నెల 10న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 'డయల్ యువర్ డిపో మేనేజర్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పలమనేరు ఆర్టీసీ డీఎం టీకే స్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని ప్రయాణికులు సమస్యలను తమ దృష్టికి తేవడంతోపాటు సలహాలు-సూచనలు, ఫిర్యాదులు చేయడానికి 9959225678 సెల్ నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

ఆర్టీసీ లక్కీడిప్ విజేతలకు బహుమతులు

పుంగనూరు: ఆర్టీసీ లక్కీ డిప్ విజేతలకు మంగళవారం పుంగనూరులో డిపోలో డీఎం సుధాకరయ్య, ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు జయరామిరెడ్డి బహుమతులు అందజేశారు. పుంగనూరు-రాయచోటి ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన సోమల మండలానికి చెందిన ఉషారాణి, పుంగనూరుకు చెందిన మల్లికార్జునకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్ర ప్రచార కార్యక్రమాలతోనే చైతన్యం



దేశవ్యాప్త శాస్త్ర ప్రచార బ్యానర్‌తో జేవీవీ సభ్యులు

పలమనేరు: శాస్త్ర ప్రచార కార్యక్రమాలతోనే ప్రజలు చైతన్యవంతులవుతారని జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు యుగంధర్ అన్నారు. సర్ సీవీ రామన్, మేడం క్యూరీ జయంతి పురస్కరించుకుని దేశవ్యాప్త శాస్త్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా స్థానిక బాలికోన్నత పాఠశాలలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక నాయకులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్‌ను విద్యార్థులకు తెలిపే లక్ష్యంతో వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 సైన్సు ఎగ్జిబిషన్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇంద్రజాల ప్రదర్శనలు, పోస్టర్ల రూపంలో ప్రచారం చేస్తామన్నారు. ప్రజలకు సైన్స్‌పై అవగాహన కలిగించి, మూఢ నమ్మకాలను పారద్రోలడమే జేవీవీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గిరిధర్‌మూర్తి, ఉపాధ్యక్షుడు కుమారస్వామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చైతన్య, పాఠశాల హెచ్ఎం లత తదితరులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

వి.కోట: టపాసులు విక్రయానికి మంగళవారం అధికారులు స్థల పరిశీలన చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రదేశం టపాసుల దుకాణాల ఏర్పాటుకు అనుకూలంగా ఉందని నిర్ధారించారు. లైసెన్సులు లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు పాటించాలన్నారు. తహసీల్దార్ చిట్టిబాబు, ఎస్‌ఐ మనోహర్, ఫైర్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

సదుం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఇంటింటా విస్తృత ప్రచారం చేయాలని జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. బూరగమంద, మొరవపల్లె పంచాయతీలకు సంబంధించి 'వై ఏపీ నీడ్స్ జగన్'పై మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు జగన్నాథం, వెంకటరమణ, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

సదుం: రానున్న బాలల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, రన్నింగ్, వాలీబాల్, బాలికలకు గన్నీబ్యాగ్ పోటీలను పీడీలు కిశోర్‌కుమార్, రెడ్డి ప్రవీణ్ నిర్వహించారు. విజేతలకు ఈనెల 14న బహుమతులు అందజేస్తామని హెచ్ఎం సుబ్రమణ్యం చెప్పారు.